# అత్యవసర సేవల విభాగాలు సమష్టిగా పని



పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
గురువారం | 08 అక్టోబరు, 2026 | పేజీలు : 08

## 'చామన్‌పల్లి'లో పకడ్బందీగా..

# భూ సమస్యల రీ-సర్వే పూర్తి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** లక్ష్మణచందా మండలం న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం పర్యటించి భూ సమస్యలు,రీసర్వే పనుల పురోగతిని పరిశీలించారు.ముందుగా న్యూ కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు,గ్రామస్తులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల పట్టాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సహకారం కీలకమని పేర్కొన్నారు.భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించి,అర్హత ఉన్న ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూముల పట్టాలకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూ చించారు.గ్రామస్తుల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు చొరవతో పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం చామన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీసర్వే పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న కమతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన రీస ర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.రీసర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సర్వే బృందం సిబ్బంది పర్యవేక్షణలో, సంబంధిత భూ కమతాల రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు.సర్వే వివరాల నమోదులో ఎ లాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమే ష్,ఆర్డీవో దేవీదాస్,ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్,తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ,సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, లక్ష్మి ,ఉప సర్పంచ్‌లు ,గంగారెడ్డి, అధికారులు,సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.



### ప్రత్యేక నిధులిస్తేనే

## నగరాభివృద్ధి

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**ప్రజాక్షం/కరీంనగర్ టౌన్ :** నగరం వేగంగా అభివృద్ధి చెందాలంటే కేవలం నగరపాలక సంస్థ నిధులతోనే సాధ్యం కాదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని 21వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మేయర్ కొలగాని శ్రీనివాస్, స్థానిక కార్పోరేటర్ వరాల నర్సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వారికి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గతంలో

తరువాయి 2 లో...

## కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తెలంగాణ ఉద్యమంలో తమ ఆట, పాటలతో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు.బుధవారం రోజున పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో

తరువాయి 2 లో...

## దసరా, బతుకమ్మ వేడుకలకు

# పకడ్బందీ ఏర్పాట్లు

### మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్

**ప్రజాపక్షం/జగిత్యాల :** దసరా,బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ పేర్కొన్నారు.దసరా నవరాత్రోత్సవాలు, బతుకమ్మ పండుగ, దేవుడి ఊరేగింపుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై శ్రీమాన్ నంబి వేణుగోపాల చార్య కౌశిక మున్సిపల్ చైర్‌పర్సన్ శ సమీండ్ల వాణి శ్రీనివాస్, కమిషనర్ సత్యప్రణవ్‌లను కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా నంబి వేణుగోపాల చార్య కౌశిక గారు

తరువాయి 2 లో...



# అత్యవసర సేవల విభాగాలు సమష్టిగా పని

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** అత్యవసర సేవల విభాగాలు సమిష్టిగా పనిచేయాలి. గోల్డెన్ అవర్‌లో సమర్థవంతంగా స్పందించినప్పుడే రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణలను కాపాడగలమని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయిచైతన్య అన్నారు. బుధవారం నిజామాబాద్ పోలీసు శాఖ సౌజన్యంతో సేవ్ లైఫ్ ఫౌండేషన్, వెర్టిస్ ఫౌండేషన్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో అవగాహన, సమన్వయ కార్యక్రమాన్ని పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు, ఫైర్ సర్వీస్, 108 అంబులెన్స్, ఆసుపత్రుల మధ్య సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు త్వరిత స్పందన సకాలంలో వైద్యం సమన్వయంతో తరలింపు ప్రాణ రక్షణ అనే విధానంతో అన్ని అత్యవసర సేవల విభాగాలు సమిష్టిగా పనిచేయాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర వైద్య సహాయం అందించి, గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడే విధంగా అత్యవసర సేవల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సకాలంలో ప్రాథమిక వైద్యం అందించడం, వెంటనే అంబులెన్సును సమకూర్చడం, అవసరమైతే ఫైర్ సర్వీస్ సహాయంతో బాధితుడికి సురక్షితంగా బయటకు తీసుకురావడం, ఎలాంటి ఆలస్యం లేకుండా ఆసుపత్రికి తరలించడం వంటి చర్యలు సమన్వయంతో జరగాలని సూచించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించడం, ప్రమాదంలో చిక్కుకున్న వారికి సహాయం చేయడం, 108, ఇతర అంబులెన్స్ సేవలకు సమాచారం అందించడం వంటి చర్యలను వేగంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా తీవ్ర ప్రమాదాల్లో వాహనాల్లో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసుకురావడానికి ఫైర్ సర్వీస్ సిబ్బంది తక్షణమే స్పందించాలని, 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర వైద్య సేవలు అందిస్తూ బాధితులను త్వరితగతిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్య సిబ్బంది కూడా రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి నిమిషం ఒక ప్రాణాన్ని కాపాడగలదు రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి గోల్డెన్ అవర్‌లో సరైన వైద్య సహాయం అందితే ప్రాణాపాయ పరిస్తితి నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రమాదం జరిగిన వెంటనే స్పందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అదనపు డిసిపి (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్, నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, సేవ్ లైఫ్‌ఫౌండేషన్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ మహేశ్, సిఈవో ప్యూష్ తివారీ, మేనేజర్ నూర్ కేథర్ పాల్, సిఓపి ఇలియానా, అసోసియేటెడ్ డైరెక్టర్ మల్లికార్జున్, సిఓసి డాక్టర్ పుష్పందర్ కౌశిక్, డిటిఓ రమేష్ రాథోడ్, డిఎఫ్ఓ పరమేశ్వర్, 108 డైరెక్టర్ డాక్టర్ స్వరాజ్, డిఎం అండ్ హెచ్‌వో సిబ్బంది, డాక్టర్ సందీప్, ఐ రాడ్ మేనేజర్ వర్ష, పాల్గొన్నారు.

## భూపాలపట్నం-వెదురుగట్ట బ్రిడ్జికి రూ.1.57 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం / చొప్పదండి :** భూపాలపట్నం గ్రామం నుంచి వెదురుగట్ట వెళ్లే మార్గంలో కుంగిపోయిన బ్రిడ్జి స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.57 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం చొరవతో ఈ నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు కరెంటు ఇవ్వకపోతే ప్రభుత్వానికి రైతులు ఉసురు తగులుతుంది

### మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**ప్రజాపక్షం / గంగాధర :** రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే వారి ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మాటలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిజం చేస్తుందని విమర్శించారు. గంగాధర మండలం మధురానగర్‌లో కరీంనగర్‌జగిత్యాల ప్రధాన జాతీయ రహదారిపై నిత్యం విద్యుత్ కోతలను నిరసిస్తూ బుధవారం రైతులు, బిఆర్ఎస్ నాయకులతో కలిసి సుంకె రవిశంకర్ ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందించామని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 6 గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని మండిపడ్డారు. వరి పొట్టదశలో ఉందని ఎక్కువ నీరు అవసరమైన సమయంలో కరెంట్ లేక రైతులు కన్నీరు మున్నీరవుతున్నారని లో వోల్టేజీతో కరెంట్ మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొన్ని చోట్ల రైతులు పంటలకు నిప్పు పెడుతున్నా ప్రభుత్వం




పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్తు ఇవ్వకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని గంగాధర పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ ధర్నాలో నాయకులు సాగి మహిపాల్ రావు, మేచినేని నవీన్ రావు, కంకణాల విజయేందర్ రెడ్డి, గంట్ల జితేందర్ రెడ్డి, ద్యావ మధుసూదన్ రెడ్డి, నాగి శేఖర్, చిలుక రవీందర్, కత్తెరపాక కొండయ్య, జనగం శ్రీనివాస్, గంటల వెంకట్ రెడ్డి, వేముల దామోదర్, రామిడి సురెందర్, దూలం శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లాంపూర్ అభివృద్ధికి నిధులు మంజూరు

### ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్థులు

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలంలోని ఇస్లాంపూర్ గ్రామ అభివృద్ధిలో భాగంగా చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం పలు అభివృద్ధి పనులకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయించారు. అడిగిన వెంటనే స్పందించి గ్రామానికి అవసరమైన మంచినీటి బావి, ప్రభుత్వ పాఠశాలకు బోరుబావి, బాత్రూంల నిర్మాణం, పాఠశాల మరమ్మత్తుల పనులకు, ఎస్సీ, బీసీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి అలాగే గౌడ సంఘం ఆధ్వర్యంలోని ఎల్లమ్మ తల్లి గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను బుధవారం గ్రామస్థుల మధ్య సర్పంచ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బారాజు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యం ఎంతో సహకరిస్తున్నారని తమ విజ్ఞప్తిని మన్నించి వెంటనే నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎమ్మెల్యే సత్యంకు గ్రామ పాలకమండలి సభ్యులు, గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్ రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



## గన్నేరువరం-సికింద్రాబాద్ బస్సు నిలిపివేత

### ప్రయాణీకుల తీవ్ర అవస్థలు

**ప్రజాపక్షం / గన్నేరువరం :** ఇటీవలే అత్యంత వైభవంగా ప్రారంభమైన కరీంనగర్‌గన్నేరువరం వయా బెజ్జంకి మీదుగా సికింద్రాబాద్ వెళ్లే తెలంగాణ ఆర్టీసీ బస్సు సర్వీస్ ఇప్పుడు మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు హడావుడిగా ప్రారంభించిన ఈ బస్సు సర్వీస్ ప్రారంభించిన కొద్ది రోజులకే నిలిచిపోవడంపై స్థానిక ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి ఈ బస్సు రాకపోవడంతో నిత్యం హైదరాబాద్, సికింద్రాబాద్ వైపు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూటులో ఉన్న గ్రామాల ప్రజలు బస్సు కోసం గంటల తరబడి బస్ స్టాండ్లలో నిరీక్షించి చివరకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అధిక ఛార్జీలు చెల్లించుకొని వెళ్లాల్సి వస్తోంది.

### ప్రజాప్రతినిధులు ప్రచారానికే పరిమితమా..?

ప్రాంతీయ అవసరాలను తీరుస్తోందని గ్రామీణ ప్రాంతాల నుంచి నేరుగా రాజధానికి రవాణా సౌకర్యం అందుతుందని భావించిన ప్రజలకు ఈ సర్వీసు నిలిచిపోవడంతో తీవ్ర నిరాశను మిగిల్చింది. ప్రజా ప్రతినిధులు కేవలం రిబ్బన్ కట్టింగ్ వేడుకలకు, పబ్లిసిటీకే పరిమితమవుతున్నారని ఆర్టీసీ అధికారులు మాత్రం ప్రారంభోత్సవాల తర్వాత బస్సుల నిర్వహణను పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

### వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్

ఏదైనా సాంకేతిక కారణాల వల్ల లేదా రూట్ సమస్యల వల్ల బస్సు నిలిపివేశారా లేక శాశ్వతంగా రద్దు చేశారా అని అధికారులు స్పష్టం చేయాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు. నిలిచిపోయిన బస్సు సర్వీసును యథావిధిగా నడిపించి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** తెలంగాణ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70వ రాష్ట్రస్థాయి జుడో పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి జోడో పోటీలలో 10వ తరగతికి చెందిన ఎ.శష్విత్ రెడ్డి 81 కేజీ, వి,కుషాల్ 90 ప్లస్ కేజీలు బాలుర అండర్17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి జుడో ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు తోపాటు డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వియుయం ప్రసాద్, వినోద్ రావు, కె.హన్మంతరావులు ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రత్యేక నిధులిస్తేనే నగరాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాంతమంతా ఒక గ్రామంగా ఉండేదని తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలో ఇక్కడ కనీసం రోడ్లు కూడా లేవని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించి కరీంనగర్ నగరానికి వందల కోట్లు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దారని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులు కరీంనగర్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేయాలని గంగుల విజ్ఞప్తి చేశారు. రానున్న రెండేళ్లలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ తర్వాత నగరంలో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్, నాయకులు గాదె శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ ఎంపిటిసి ఉప్పు శ్రీనివాస్, స్థానిక డివిజన్ నాయకులు రత్నాకర్, జిపి స్వామి, పటేల్ సుధీర్ రెడ్డి, జీకే యువత సభ్యులు మొగులోజు వెంకట తోట కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా, బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

2026 అక్టోబర్ 11, ఆదివారం శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమై,అక్టోబర్ 18,ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ,అక్టోబర్ 20, మంగళవారం దసరా పండుగ నిర్వహించనున్నట్లు వివరించారు.ఈ ఉత్సవాలను ప్రజలు,భక్తులు ప్రశాంతంగా,ఆనందంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.అనంతరం జంబిగద్దె ప్రాంతాన్ని పరిశీలించి, దేవుడి ఊరేగింపు మరియు భక్తుల సౌకర్యాల దృష్ట్యా చేపట్టాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.మున్సిపల్ కౌన్సిలర్లు సుంకేటి మమత రామకృష్ణ రెడ్డి, పంబాల సుజాత రాము, కోరే జయ గంగమల్లు, దుమాల రాజ్‌కుమార్, పిట్ట ధర్మరాజు,చెట్టే గంగాధర్, క్యాదసు నవీన్,మాజీ కౌన్సిలర్ రేపల్లె హరికృష్ణ, మున్సిపల్ అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

(మొదటి పేజీ తరువాయి)

పెట్టిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష కు సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరుద్యోగ కళాకారులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి, ప్రజలను చైతన్యపరిచారని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, కళాకారులు న్యాయమైన డిమాండ్ల కోసం నిరాహార దీక్షలు చేయాల్సి రావడం విచారకరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి డిమాండ్లను పరిష్కరించకపోతే సిపిఐ పార్టీ తరఫున కళాకారుల పోరాటానికి అన్ని వేళలా అండగా ఉంటామని తెలిపారు.పెద్దపల్లి సీపీఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్,పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు.ఎండి రజాక్,తుంగాని.రాకేష్ ,రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్. దబ్బేట పుష్పలత ,రాష్ట్ర కల్చరల్ ఇంచార్జ్. కలవేని రాణి ,రాష్ట్ర ఆర్గనైజర్ తెలంగాణ ఉద్యమ కళాకారుడు. కన్నూరి ఆంజనేయులు, తెలంగాణ ఉద్యమ కళాకారుడు గాజుల రమేష్,తెలంగాణ ఉద్యమ కళాకారుడు దుబాసి శ్రీనివాస్,పులిపాక బానిష్ నిట్టూరు సరూప,బట్టల గీత ,పెండెం కళ్యాణి పాల్గొన్నారు.

## ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపద్దు

### సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమయంలో విద్యుత్ చార్జీల భారాన్ని మరింత పెంచడం ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## సీతంపేటలో బతుకమ్మ పండుగ ఏర్పాట్లు

ప్రజాపక్షం/ముత్తారం : తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సీతంపేట గ్రామంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సర్పంచ్ ఇండ్ల కృష్ణవేణి సదానందం ఆధ్వర్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనేలా పంచాయతీ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. బతుకమ్మ ఆడే స్థలంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఫ్రంట్ బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో భూమిని చదును చేయించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.పండుగ రోజుల్లో గ్రామంలో పారిశుధ్య లోపం లేకుండా,లైటింగ్ తదితర సౌకర్యాలలో ఎక్కడా లోటుపాట్లు రాకుండా చూసేందుకు సర్పంచ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతుండటం పట్ల మహిళలు,గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించిన డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్

ప్రజాపక్షం/రామగిరి : బుధవారం అడ్రియాల లాంగ్ వాల్ గనిని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల.వెంకటేశ్వర్లు సందర్శించారు.అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు నిర్దేశించిన సమయంలో లాంగ్ వాల్ పనులను పూర్తి చేయడానికి తీసుకొంటున్న చర్యలను వివరించారు.అనంతరం డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ మాట్లాడుతూ లాంగ్వాల్ 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పూర్తి చేసినందుకు గాను అందులో భాగస్వాములు అయిన వారికి అభినందనలు తెలిపారు. 4వ ప్యానెల్ తయారీ పనుల పై చర్చించి, భద్రత పై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వారితో పాటు రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, కార్పొరేట్ భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె.యాదయ్య, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ఏరియా ప్రాజెక్ట్ ఇంజినీర్ దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ బాలరాజు, మేనేజర్ పెంచలయ్య, వెన్సర్ కంపెనీ అధికారులు రాజన్న,చక్రవర్తి,పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఎదుగుదల సర్పంచ్ ఓగుల పూజా రాజేందర్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పౌష్టిక ఆహారం అందించడంతోనే పిల్లల్లో సంపూర్ణ ఎదుగుదల కనిపిస్తుందని సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ అన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ మాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ పూజా రాజేందర్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వ అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు బాలింతలు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ రజిత మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో పౌష్టికార్య ఆహారం, ఆకుకూరలు పండ్లు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. గ్రామ సర్పంచ్ పూజా రాజేందర్, ఉప సర్పంచ్ దాసరి రాయమల్లు, కార్యదర్శి ప్రత్యూష,మహిళా సభ్యురాలు శోభా ఆనందరావు,వార్డు సభ్యులు ఆశ వర్కర్లు,పాల్గొన్నారు.

# ప్రజాసేవే మోడీ ప్రస్థానానికి ప్రధాన స్ఫూర్తి

ప్రజాక్షం / రాజన్న సిరిసిల్ల : ప్రజాసేవే ప్రధాని మోడీ ప్రస్థానానికి ప్రధాన స్ఫూర్తి అని వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బిజేపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పిలుపునిచ్చారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కొనసాగుతున్న 25 సంవత్సరాల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బిజేపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప సభ సేవాజ్యోతి యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద అమరవీరుల స్థూపం సమీపంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా బిజేపికార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని గోపి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పెద్దరెడ్డి, జిల్లా ఇంఛార్జి గంగాడి మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం సేవా జ్యోతి యాత్రను ప్రారంభించారు. పాత బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్ వరకు బిజేపి జెండాలు చేత




బట్టి తరలివెళ్లారు. ప్రధాన మంత్రి మోడీ జీవిత ప్రస్థానం దేశ సేవ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో కొనసాగుతుందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో సేవా భావాన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ సేవా సంకల్ప అభియాన్ ద్వారా ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ బిజేపి కార్యకర్తలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్, లింగంపల్లి శంకర్, కుమ్మరి శంకర్, కౌడిపల్లి గోపాల్ రెడ్డి, దుమాల శ్రీకాంత్, గరిపెల్లి ప్రభాకర్, సంటి మహేశ్, పొన్నాల తిరుపతి రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్, బర్కం లక్ష్మీ, బండ మల్లేశం, శీలం రాజు, సంతోష్ రెడ్డి, బిజేపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ఎంపిల అరెస్టు అప్రజాస్వామికం

### కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు

ప్రజాపక్షం/కరీంనగర్: ఓటరు జాబితాల సవరణ పేరుతో దేశంలో ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసే పరిస్థితులు నెలకొంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ఓటర్ల హక్కులపై ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కేసి వేణుగోపాల్ తో పాటు ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆయన తీవ్రంగా ఖండించారు.బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ "ఓటు అనేది కేవలం ఒక గుర్తు కాదు.. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఆయుధం. ఆ ఓటు హక్కుకు సంబంధించిన అనుమానాలు, సందేహాలపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రశ్నించిన నాయకులను అరెస్టు చేయడం సమస్యకు పరిష్కారం కాదు" అని రాజేందర్ రావు అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉండాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాలని ఆయన అన్నారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమగ్రంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "దేశ ప్రజాస్వామ్యానికి ఎన్నికల సంఘం ఒక కాపలాదారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారనీ ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఆయన ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలనీ డిమాండ్ చేశారు. "దేశంలో ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే ఓటు హక్కు బలంగా ఉండాలని, ఓటు హక్కు బలంగా ఉండాలంటే ఓటరు జాబితాలు పారదర్శకంగా ఉండాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలని, ఈ మూడు అంశాల్లో ఎక్కడైనా అనుమానం తలెత్తితే ప్రజాస్వామ్యానికి నష్టం జరుగుతుందన్నారు. అందుకే ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుంది" అని వెలిచాల రాజేందర్ రావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల తరఫున నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కార్పొరేట్ మెడికల్ బోర్డు విధానాన్ని పునఃసమీక్షించాలి

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి సంస్థలో నిర్వహిస్తున్న కార్పొరేట్ మెడికల్ బోర్డు విధానాన్ని యాజమాన్యం పునఃసమీక్షించి, తీవ్ర అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేస్తుందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డుల్లో అన్‌ఫిట్ గా నిర్ధారించబడుతున్న కార్మికుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. గత మూడు మెడికల్ బోర్డుల్లో వరుసగా సుమారుగా 4 శాతం, 14 శాతం, 10 శాతం మంది మాత్రమే అన్‌ఫిట్ గా నిర్ధారించబడిన పరిస్థితిని యాజమాన్యం సమగ్రంగా సమీక్షించాలని ఆయన కోరారు.ముఖ్యంగా గుండెకు స్టెంట్లు వేయించుకున్న కార్మికులు, కిడ్నీ సంబంధిత తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, శారీరకంగా కఠినమైన విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న కార్మికులు సైతం అన్‌ఫిట్ గా నిర్ధారించబడకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించిన నేపథ్యంలో, తీవ్ర అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని కార్మికులను గుర్తించేందుకు రీమెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, మరోసారి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వైద్యపరంగా అర్హత ఉన్న కార్మికులను నిబంధనల ప్రకారం అన్‌ఫిట్ గా నిర్ధారించి వారికి న్యాయం చేయాలని కోరారు. మెడికల్ బోర్డు ప్రక్రియ కేవలం హైదరాబాద్ నుంచి వచ్చే వైద్యుల అభిప్రాయాలకే పరిమితం కాకుండా, కార్మికుల వాస్తవ ఆరోగ్య పరిస్థితి, వారు నిర్వహిస్తున్న విధుల స్వభావం, శారీరక సామర్థ్యం, వైద్య నివేదికలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. మెడికల్ బోర్డుల నిర్వహణలో ఏకరీతి విధానం, పారదర్శకత, వైద్యపరమైన న్యాయం పాటించాలని సూచించారు. అమలు చేసిన విధానాలను కూడా పునఃపరిశీలించి, తీవ్ర అనారోగ్యంతో విధులు నిర్వహించలేని ప్రతి అర్హత కలిగిన కార్మికుడికి నిబంధనల ప్రకారం అన్‌ఫిట్ సర్టిఫికేషన్ లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## వయో వృద్ధులు సమాజానికి మార్గదర్శకులు

### అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజాక్షం / కరీంనగర్ టౌన్ : వయోవృద్ధులు తమ జీవిత అనుభవాలతో సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారని వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామని యోగా, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం వయో వృద్ధుల సంక్షేమానికి సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లను సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాజగోపాల్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి గీత, న్యాయవాది రాజారెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్సై జ్యోత్స్న మహేశ్వర్, రిటైర్డ్ ఆర్‌డిఓ మనీష్, బ్రహ్మకుమారి, కేశవ రెడ్డి, బండ సత్తయ్య, మోసం అంజయ్య, ఆనందం, సుధాకర్, బాలకిషన్, రామస్వామి, లక్ష్మీపతి, మోహ్మద్ ఉస్మాన్ పాషా, శంకరయ్య, నారాయణ రెడ్డి, రామేశం, పాల్గొన్నారు.

## సిసి రోడ్డు గుంతల సమస్య పరిష్కరించిన సర్పంచ్

### సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు

ప్రజాపక్షం/ముత్తారం :గ్రామంలో ఎదురవుతున్న సీసీ రోడ్ల సమస్యలపై తక్షణమే స్పందించి, వాటిని పరిష్కరించిన గ్రామ సర్పంచ్ చిలివేరి జ్యోతి లక్ష్మణ్ కి మచ్చుపేట గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ పైపుల పనుల వల్ల,ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామంలోని ప్రధాన రహదారులపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి.దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న సర్పంచ్‌తో పాటు, ఆమెకు అండగా నిలిచి సహకరించిన గ్రామ పాలకవర్గ సభ్యులందరికీ గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని గ్రామ ప్రజలు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## బాహ్యా మూల్యాంకనం కేంద్రాన్ని సందర్శించిన జిల్లా విద్యాధికారి

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జరుగుతున్న 9వ తరగతి సమ్మేటివ్ 1 బాహ్య మూల్యాంకనం ను జిల్లా విద్యాధికారి శారద సందర్శించారు.మూల్యాంకన విధానాన్ని పరిశీలించి సూచనలు ఇవ్వడం జరిగింది.తదనంతరం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు జరుగుతున్న సమ్మేటివ్ పరీక్షలను పరిశీలించడం జరిగింది. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కేంద్రంలో మండల విద్యాధికారి రాజయ్య,క్యాంప్ ఆఫీసర్ పాఠశాలప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి,లింగయ్య ,తొమ్మిది మంది ఉపాధ్యాయులు,మూల్యాంకకులు సిఆర్ పిలు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు భారీ నిరసన ర్యాలీ

ప్రజాపక్షం/గోదావరిఖని : సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండీ.ముస్తఫా ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని మెయిన్ చౌరస్తా నుండి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు భారీ ర్యాలీ నిర్వహించాయి. ర్యాలీ అనంతరం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి,ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, మేయర్ మహంకాళి స్వామిలు పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించి అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడ తొలగించవద్దని ఈసీని వారు డిమాండ్ చేశారు.కార్పొరేటర్లు, ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలైన సిపిఐ, సిపిఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ, ఐ.ఎన్.టి.యు.సి.,గంగ పుత్ర, ముదిరాజ్, యాదవ్,విశ్వ బ్రాహ్మణ,నాయి బ్రాహ్మణ ,మాల, మాదిగ, మైనారిటీ, గౌడ, మిగతా కుల సంఘాల నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన సరికొత్త వెలుగులు



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** నిన్నటివరకు వారిది చూపులేని శూన్యం..నిత్యం తోడు కోసం ఎదురుచూసే దైన్యం! కానీ నేడు వారి నయనాలు నవ వసంతాన్ని సంతరించుకున్నాయి.గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత సేవా యజ్ఞం 32 మంది పేద వృద్ధుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపింది.మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో శ్రీరాములపల్లి,రాఘవపట్నం,మల్లన్నపేట, బీబీ రాజుపల్లి, రంగదాముని‌పల్లి గ్రామాల నుంచి కంటి సమస్యలతో బాధపడుతున్న 32 మందిని గుర్తించారు.అనంతరం వారిని ప్రత్యేక వాహనంలో రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించి,నిపుణులైన వైద్యులతో పైసా ఖర్చు లేకుండా అత్యాధునిక శస్త్రచికిత్సలు చేయించారు.

**ఆ కళ్లల్లోని ఆనందమే మాకు సంతృప్తి :** బొమ్మన కుమార్ (లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్) ఆర్థిక స్తోమత లేక నిస్సహాయ స్థితిలో మగ్గుతున్న పేదలకు చూపును ప్రసాదించడంలో దక్కిన ఆనందం మాటల్లో చెప్పలేనిది. ఆపరేషన్ అనంతరం కట్టు విప్పి, తిరిగి లోకాన్ని చూస్తూ ఆ వృద్ధులు చేతులెత్తి మొక్కుతుంటే కలిగిన తృప్తి వెలకట్టలేనిది. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తాం.

**సేవలో భాగస్వామ్యం కావడం అదృష్టం :** సల్లూరి శోభన్ (సర్పంచ్ /ప్రోగ్రామ్ నిర్వాహకులు) చూపులేక చీకటి గదులకే పరిమితమైన నిరుపేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేయించి, తిరిగి వెలుగులు నింపడం ఎంతో పుణ్యకార్యం. పేదలకు అండగా నిలిచి ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన లయన్స్ క్లబ్,రేకుర్తి ఆసుపత్రి బృందానికి గ్రామస్తుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కవితా రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శనిగారపు మల్లేశం, లయన్స్ క్లబ్ సభ్యులు తాడూరి సత్యనారాయణ,కోశాధికారి సట్ట సురేష్, పాలకవర్గ సభ్యులు వడ్లకొండ బుచ్చయ్య, గడ్డం తిరుపతి రెడ్డి,చాడ సత్తయ్య,ఆసుపత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వసతి సౌకర్యాల కోసం చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండల కేంద్రంలోని గిరిజన మినీ గురుకులం తెలంగాణ మోడల్ స్కూల్ లను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ బుధవారం సందర్శించి పాఠశాలలోని వసతులను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆరోగ్యకరమైన వాతావరణం మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థుల భద్రతతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నరేష్,విద్యాధికారి రాము,తదితరులు ఉన్నారు.

## అక్రమంగా పట్టా చేసుకున్నాడు.. న్యాయం చేయండి



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన వన్నెల దాస్ శాంతారామ్ అనే వ్యక్తి 217/2/1 సర్వే నెంబర్ లోని ఎకరం 14 గుంటల తన భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని సంబంధిత అధికారులు తనకు న్యాయం చేయాలని రత్నాపూర్ గ్రామానికి చెందిన గంగోని మల్లేష్ అనే రైతు అధికారులను వేడుకుంటున్నాడు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సాదా బై నామ లతో చాలామంది రైతుల భూములను అక్రమంగా పట్టాలు చేసుకుని హరిగోశ పెడుతున్నాడని,అందులో తాను సైతం ఒక్కడినని అధికారులు తనకు న్యాయం చేయాలని ఇలాంటి అక్రమార్కులపై దృష్టి సారిస్తూ సామాన్య రైతులకు,ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. కాగా ఇదే విషయమై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సైతం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మల్లేష్ తెలిపారు.

# పాఠశాలలో వన్యప్రాణి వారోత్సవాలు



**ప్రజా పక్షం/బీర్‌పూర్ :** జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలంలోని చిత్రవేణి గూడెం,మానవాళి మనుగడకు విడదీయరాని బంధం ఉన్న అడవులను, వృక్ష సంపదను విచక్షణారహితంగా నరికివేయడం వల్ల అటవీ జంతువుల ఉనికి ప్రమాదంలో పడుతోందని, దీనివల్ల జీవవైవిధ్యం దెబ్బతింటోందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు.జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని చిత్రవేణి గూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో దర్మపూరి అటవీ శాఖ అధికారి శ్రీనాథ్ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల్లో ప్రకృతి ప్రత్యక్ష అనుభవం, వన్యప్రాణులను కాపాడుకోవాలని అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బహుమతులు,ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, చంద్రారెడ్డి,ఎఫ్ ఎస్ ఓ రాథోడ్,ప్రకాష గోపీనాథ్ రెడ్డి,జూనియర్ అసిస్టెంట్ ఎఫ్ బి ఓం లు నవిన్,ఆనంద్,రవిందర్,రమేష్ , కిరణ్ ,నాగరాజు ,నరసయ్య ,సాంబయ్య, బేస్ క్యాంప్ సిబ్బంది,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,శ్రీనివాస్ టీచర్స్ శ్రీనివాస్,రాజు,రవి,వినోద్,మౌనిక,సుజాత దివ్య,ఉపాధ్యాయ బృందం,ఆశ్రమ పాఠశాల విద్యార్థులు,గ్రామస్తులు,అటవీ శాఖ ధర్మపురి రేంజ్,ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల యాజమాన్యం,తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ విలువలను కాపాడాల్సిన బాధ్యత మహిళలదే

మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్



**ప్రజాపక్షం/జగిత్యాల :** కుటుంబ విలువలను, సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత మహిళలపైనే ఉందని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అన్నారు.వాల్మీకి ఆవాసం సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో ఎనిమిదవ బ్యాచ్ లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి తమ కుటుంబానికి ఆర్థికచేయూతనందించాలనే ఉద్దేశంతో సేవా భారతి ఆధ్వర్యంలో గత మూడు నెలలు గా ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణను అందించడం అభినందనీయం అన్నారు.తమ పిల్లలకు చదువుతోపాటు ఉత్తమ సంస్కారాన్ని కుటుంబ విలువలను అందించాలని సూచించారు.సేవా భారతి ద్వారా శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ తమకు తోచిన రీతిలో సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంత రావు, ఆర్‌ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ,సేవా భారతి జిల్లా అధ్యక్షుడు ఎస్వీ సుబ్రహ్మణ్యం,వాల్మీకి ఆవాస కార్యదర్శి మదన్మోహన్ రావు, ఆవాస సభ్యులు బెజ్జంకి సంపూర్ణ చారి, బొమ్మెర సత్యనారాయణ, స్రవంతి, శిక్షణ కేంద్రం ఇన్చార్జ్ కవిత మహిళలు పాల్గొన్నారు.

# మురికి నీటిలో బతుకమ్మ నిమజ్జనమా..?

వాగులోకి చేరుతున్న మురుగు నీరు..

కలుషితమవుతున్న జలాలు



వినాయక నిమజ్జనం చేసిన విగ్రహాల ఫోటో

**ప్రజాపక్షం /కోరుట్ల :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సమీపిస్తున్న వేళ కోరుట్ల పట్టణ పరిసరాల్లోని వాగులో మురుగు నీరు చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలో బతుకమ్మ నిమజ్జనం (విసర్జన) అనేది పండుగలో అత్యంత ముఖ్యమైన ఘట్టం. పట్టణంలోని పలు వార్డుల నుంచి వచ్చే మురుగు నీరు వాగులోకి చేరడంతో నీరు కలుషితమై, చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్న పరిస్థితి నెలకొంది.బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను అలంకరించి పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం వాగులో మురికి నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఇలాంటి నీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేసేదెలా? అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో వర్షాల సమయంలో వాగులోకి భారీగా వరద నీరు చేరడంతో నీరు శుభ్రంగా ఉండేదని,గణేష్ నిమజ్జనాలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం మాత్రం వరద నీరు లేకపోవడంతో పట్టణంలోని మురుగు నీరు వాగులోకి చేరి నీటిని పూర్తిగా కలుషితం చేస్తోందని పేర్కొంటున్నారు.బతుకమ్మ పండుగకు కొద్దిరోజులే సమయం ఉండటంతో మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి వాగులోని మురుగు నీటి ప్రవాహాన్ని అరికట్టి, చెత్తాచెదారాన్ని తొలగించి, చేయాలని మహిళలు, స్థానికులు కోరుతున్నారు.పండుగను భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, వాగు పరిసరాలను శుభ్రపరిచి నిమజ్జన ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



**ప్రజాపక్షం/కోరుట్ల :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కోరుట్లలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే–2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు,గౌన్లు,టోపీలు ధరించి వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ జ్యోతి చాపూరి,అసిస్టెంట్ ప్రొఫెసర్, మైక్రోబయాలజీ, నిజామాబాద్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.క్రమశిక్షణ,కష్టపడి పనిచేయడం,నిరంతర అభ్యాసం,ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ సందీప్ నడికట్ల మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ డే విద్యార్థుల జీవితంలో కీలక మైలురాయిగా పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేయడం ముగింపు కాదని, కొత్త ప్రయాణానికి ప్రారంభమని అన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, పరిశోధన, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రథమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఎరిటిష్ స్కాలర్‌షిప్‌లు, జిజ్ఞాస ప్రాజెక్టుల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఫోటో మల్లాపూర్ 04

## జమ్మి గద్దె నిర్మాణానికి భూమి పూజ

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని గుండంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల కోసం జమ్మి గద్దె నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా బుధవారం సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్య చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.జమ్మి గద్దె నిర్మాణానికి దాతగా నిలిచిన సర్పంచ్ డప్పుల పద్మ నరసయ్యకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుష్పలత నర్సయ్య,మాది సర్పంచ్ లక్ష్మి రెడ్డి,గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రాజేందర్,గంగాధర్,రాజారెడ్డి,శేఖర్ రెడ్డి,విజయ్,తిరుపతి,రాజం నరేష్,స్వామిలింగం,నారాయణ,సంతోష్,శేఖర్,క్రాంతి, తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం /పెగడపల్లి :** గ్రామ ప్రజల దీర్ఘకాలిక విజ్ఞప్తికి ఎట్టకేలకు మోక్షం లభించింది.నందగిరి గ్రామంలో నెలకొన్న విద్యుత్ లో వోల్టేజ్, సరఫరా సమస్యలకు విద్యుత్ శాఖ శాశ్వత పరిష్కారం చూపింది.గ్రామంలో అదనంగా రెండు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో గత కొంతకాలంగా ఉన్న 15 కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌పై తీవ్రమైన విద్యుత్ లోడ్ పడటంతో తరచూ సరఫరా నిలిచిపోవడం, లో వోల్టేజ్ సమస్యలు తలెత్తేవి. దీనిని గమనించిన గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు, లోడ్‌ను తగ్గించేందుకు అదనంగా 25 కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేసి ఏర్పాటు చేశారు.దీనితో పాటు, గ్రామంలో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా, వాటర్ వర్క్స్ (తాగునీటి పంపింగ్) అవసరాల కోసం ప్రత్యేకంగా మరో 25 కెవిఎ 3ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధనియాల రజిత సురేష్ యాదవ్, విద్యుత్ శాఖ ఏఈ ఎన్. హరీష్ రావు,లైన్ ఇన్‌స్పెక్టర్ ఎన్. బాలు, లైన్‌మెన్ అభిలాష్, అసిస్టెంట్ లైన్‌మెన్ జి.వెంకటేష్,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సేవా సంకల్ప్ అభియాన్‌లో వైద్య సిబ్బందికి ఘన సన్మానం

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా పెంబట్ల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)లో సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి డా.సంపూర్ణతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెంబట్ల గ్రామ సర్పంచ్ కొలపాక రాధ రాజు, ఉప సర్పంచ్ మైదం ప్రభాకర్, బిజెపి సారంగాపూర్ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు బాదినేని జమున శేఖర్, రాజారపు రాజశ్రీ, బీజెపి సీనియర్ నాయకులు ముద్దం శ్రీనివాస్, తేలు నరేష్, 99వ బూత్ అధ్యక్షుడు బొమ్మకంటి సత్యచరణ్, 100వ బూత్ అధ్యక్షుడు వంగపల్లి పవన్, కార్యకర్త పూదరి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, అకాడమిక్, కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో విబిజి రామ్ జి పనులను సర్పంచ్ భక్తు రాంచందర్ బుధవారం ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతామని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎ రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీశైలం, పాల్గొన్నారు.

## సకాలంలో చిన్నారులకు టీకాలు వేయించాలి

**ప్రజాపక్షం / వాంకిడి :** చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించి వ్యాధుల నుంచి రక్షించాలని, గర్భిణులు 90 రోజుల్లోగా పేర్లు నమోదు చేసుకుని పౌష్టికాహారం, టీకాలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం లక్ష్మీ పూర్, ఖమన అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఎఎన్ఎం పుష్ప, హెచ్ఎం జగన్నాథ్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

### ఎస్ఐ ఉదయ్ కిరణ్

**ప్రజాపక్షం / జన్నారం :** విద్యార్థులు సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని జన్నారం ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ సూచించారు. జన్నారం ఐటిఐ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ మోసాలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, ఫిషింగ్ లింకుల బారిన పడకూడదని తెలిపారు. ఓటిపి, పిన్, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికీ చెప్పవద్దని, అనుమానాస్పద లింకులు, ఎపికె ఫైల్స్ తెరవవద్దని హెచ్చరించారు. బాధితులు వెంటనే 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణ



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంచిర్యాలకు చెందిన ఇరుకుల్ల సూర్యనారాయణ నియమించబడ్డారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మి నారాయణ , రాష్ట్ర వాసవి సేవాదళ్ అధ్యక్షుడు మహంకాళి విజయ్‌కుమార్‌లు సూర్యనారాయణను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకుని నియామక పత్రంను అందజేశారు. భవిష్యత్‌లో ఈ వాసవి సేవాదళ్ ద్వారా నిరుపేద వైశ్యులకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళిక చేయడం జరుగుతుందని తెలిపారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి







**ప్రజాపక్షం / వాంకిడి / కెరమెరి:** దేశంలో ఎన్నికల పారదర్శకత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఈ సందర్భంగా కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుర్నులే మంగాజీ, వైస్ ప్రెసిడెంట్ పెంటు, టౌన్ ప్రెసిడెంట్ ధమల్కర్ కమలేష్, ఉపసర్పంచ్ దీపక్ ముండే, సర్పంచ్ కృష్ణాజీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ, జబ్రే గణేష్, సిపిఐ నాయకులు కిషన్, ప్రభాకర్, అస్పాక్, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.'

సేవ్ డెమోక్రసీ వీక్'లో భాగంగా ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో బుధవారం కెరమెరి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. ఎన్నికల సంఘంపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని, ఓటు హక్కు రక్షణకు ప్రతి పౌరుడూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు కోవా ఇందిర, డిసిసి కార్యదర్శి రాథోడ్ శంకర్, సర్పంచులు విమలాబాయి, పుష్పలత, బలవంత్, నాయకులు బాపురావు, జగన్నాథరావు, గోగర్ల రాజయ్య, సుదర్శన్, శ్రీకాంత్, కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు ఉచిత పురుగుమందుల పంపిణీ



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** కపస్ క్రాంతి పథకంలో భాగంగా మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో పత్తి రైతులకు సర్పంచ్ భక్తు రాంచందర్ బుధవారం ఉచితంగా పురుగుమందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటను ఆశించే పురుగుల నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పురుగుమందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ పంటను సంరక్షించుకుని మెరుగైన దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీవిద్య, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత



**ప్రజాపక్షం / జైపూర్ :** అడవులతోనే మానవ మనుగడ సాధ్యమని, రాజ్యాంగంలోని 51ఎ(జి) అధికరణ ప్రకారం ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని అధికారులు, ప్రకృతి మిత్ర ప్రతినిధులు స్పష్టం చేశారు. జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా బుధవారం ముదిగుంట అటవీ ప్రాంతంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల నరికివేత, ప్లాస్టిక్ వాడకం వల్లే వాతావరణంలో తీవ్ర మార్పులు వస్తున్నాయని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పిలుపునిచ్చారు. ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్ గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని సర్పంచ్ ఆకుల రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి మిత్ర వ్యవస్థాపకుడు గుండేటి యోగేశ్వర్, తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపిడిఒ బాపూరావు, అటవీ అధికారులు అజహర్, సంతోష్ కుమార్, కవి గోపగాని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ సేవలను సద్వినియోగం చేసుకోండి

### ఎమ్మెల్యే హరీష్ బాబు



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న 'లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్' ఉచిత వైద్య సేవలను సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం డిఎంహెచ్ఓ డా. సిడాం నాగేంద్రతో కలిసి ఆయన రైలు ఆసుపత్రిని పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు 20 రోజుల పాటు ఈ ఆసుపత్రి రైలులో ఓపి సేవలతో పాటు శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి, పిల్లల ఎముకల ఆపరేషన్లు, ఇఎన్‌టి, ప్లాస్టిక్ సర్జరీ, దంత వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డా. మనోహర్ రెడ్డి, యోగేష్, నాయకులు వీరభద్రచారి, హనుమంతరావు, అరుణ్ కుమార్ లోయా, పెద్ది హరీష్, సాయి కుమార్, పవన్ బల్దేవా పాల్గొన్నారు.

# సింగరేణి సొత్తు చోరీకి అడ్డుకట్ట

### జిఎం రాధాకృష్ణ



**ప్రజాపక్షం / మందమర్రి:** సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో ఎస్అండ్‌పిసి, మొబైల్ ట్రాన్స్‌పోర్ట్ ఫోర్స్ సిబ్బంది అప్రమత్తత, చాకచక్యం అభినందనీయమని మందమర్రి ఏరియా జిఎం ఎన్. రాధాకృష్ణ అన్నారు. సంస్థ సామగ్రిని చోరీకి గురికాకుండా కాపాడిన సెక్యూరిటీ సిబ్బందిని బుధవారం ఆయన శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బుధవారం తెల్లవారుజామున మంజునాథ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సోలార్ ప్లాంట్ వద్ద ఎంటిఎఫ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన ఓ వ్యాన్‌ను తనిఖీ చేయగా, సింగరేణికి చెందిన రెండు ఖరీదైన విద్యుత్ మోటార్లను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి వాహనంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సంస్థ ఆస్తులను కాపాడటం ప్రతి ఉద్యోగి బాధ్యత అని, చోరీలను అరికట్టి సంస్థను లాభాల బాటలో నడపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం జి.ఎల్. ప్రసాద్, డిజిఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, సిబ్బంది

## కోనేరు కోనప్ప జన్మదినాన నోట్‌బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం / కౌటాల:** మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదినాన్ని పురస్కరించుకుని కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బిఆర్ఎస్ నాయకులు బుధవారం నోట్‌బుక్స్, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమ ంలో సర్పంచ్ నక్క శంకర్, ఉపసర్పంచ్ డబ్బ గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దాం



**ప్రజాపక్షం / కెరమెరి :** మండల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కృష్ణారావును కార్యాలయంలో సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న పనులు, సమస్యల పరిష్కారానికి నిధుల మంజూరు, ఉపాధి హామీ పథకం కూలీలకు సకాలంలో వేతనాలు అందించడంపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఎంపిఒలు సాయిరాం గౌడ్, మల్లయ్య, సర్పంచులు పెందోర్ ఆనందరావు, బుచ్చయ్య, ఆత్రం ధర్ము, శారదా ఉమేష్, రాధాబాయి దందు, పుష్పలత, అనసూయ, చిత్రలేఖ పాల్గొన్నారు.

## డాక్టర్ అశోక్ మహుల్కర్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం / వాంకిడి :** ఎస్‌సి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్‌ను బుధవారం వాంకిడిలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. దళిత సమాజం అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి ఆయన చేస్తున్న కృషికి తగిన గుర్తింపు దక్కిందని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెండరే కృష్ణాజీ, ఉపసర్పంచ్ దీపక్ ముండే, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగాజీ, సిపిఐ నాయకుడు గోపీనాథ్, అరుణ్ మహుల్కర్, అంబేద్కర్ సంఘం నేతలు దుర్గాజీ, విజయ్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ 'పొలం బాట'




**ప్రజాపక్షం / కౌటాల :** తాటిపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ డిఇ (టెక్నికల్) సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం 'పొలం బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా తీరు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పొలాల్లో విద్యుత్ వాడే సమయంలో రైతులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎఇ అంజల్ కుమార్, ఫోర్‌మన్ నర్సింగరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, లైన్‌మన్ లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణపై యువతకు అవగాహన

**ప్రజాపక్షం / జన్నారం:** వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా తడ్లపేట్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో యువతకు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్ఓ జి. వికాస్ ఆధ్వర్యంలో తపాల్‌పూర్ చెక్‌పోస్ట్ నుంచి 19వ డిస్ట్రిబ్యూటర్ వరకు 1కె పరుగు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఆర్‌ఓలు సాగరిక, రాము, ఎఫ్ఎస్ఓలు నరేష్, అథాఉల్లా, భగవంతరావు, రహీమొద్దీన్, పద్మజ, కృష్ణమూర్తి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లోజర్ స్పేసింగ్ పత్తి సాగుపై అవగాహన



**ప్రజాపక్షం/ నేరడిగొండ:** కుమారి, నాగమల్యాల రైతు వేదికల్లో ఎఒ కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం పత్తి సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ డి. మోహన్ దాస్ మాట్లాడుతూ.. 90/30 సెం.మీ. దూరంలో క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో పత్తి సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు స్రవంతి, సాయిప్రణీత్, సర్పంచ్‌లు అమృత్‌కుమార్, గోదావరి, రైతులు పాల్గొన్నారు.

## మోదీ దేశ హితం కోసం ఆలోచించే వ్యక్తి



**ప్రజాపక్షం/భైంసా :** దేశ ప్రజలే కుటుంబ సభ్యులుగా భావించి ఎలాంటి స్వార్థం లేకుండా దేశహితం కోసమే ఆలోచించే వ్యక్తి ప్రధాని మోదీ అని ఎమ్మెల్యే ప వార్ రామ రావ్ పటేల్ అన్నారు. బుధవా రం జిల్లా కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హా ల్‌లో సేవా సంకల్ప యాత్ర సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మా ట్లాడారు.13 సంవత్సరాలు గుజరాత్ ము ఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన చే స్తున్న సేవలు శాశ్వతంగా ప్రజల గుండెల్లో ఉండిపోతాయన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

## ఆర్మూర్ సిఐగా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** పట్టణ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. ఆర్మూర్ పరిధిలో శాంతిభద్రతల ప రిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. బా ధ్యతలు స్వీకరించిన సిఐ చంద్రశేఖర్ రెడ్డికి పోలీసు సిబ్బంది ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్మూర్ సిఐ బదిలీ

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన సత్యనారాయణగౌడ్ బుధవారం బదిలీపై నిజామాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్మూర్‌లో తన విధి నిర్వహణకు సహకరించిన ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, మిత్రులు, పోలీసు సిబ్బంది, వివిధ వర్గాల నాయకులు, ప్రజలు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మూర్‌లో పని చేసిన కాలంలో శాంతి భద్రతల పరిరక్షణకు, ప్ర జలకు మెరుగైన పోలీస్‌సేవలు అందించేందుకు ప్రతిఒక్కరి సహకారం ఎంతో ఉపయోగపడిందని సిఐ పేర్కొన్నారు.

## పసుపు, కూరగాయల సాగుపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం /దిలావర్‌పూర్ :** నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలోని రైతు వేదికలో ఉద్యాన వన శాఖ, ఆవైల్ ఫౌండేషన్ మరియు ఆత్మ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.పసుపు పంటలో ఆధునిక సాగు పద్ధతులు,చీడపీడల నివారణ చర్యలు అలాగే సమగ్ర విధానంలో కూరగాయల సాగుపై ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ,ఉద్యాన రంగానికి చెందిన పలువురు నిపుణులు,అధికారులు హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.సదస్సులో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సకాలంలో భూసార పరీక్షలు నిర్వహించి,నాణ్యమైన విత్తన దుంపలను ఎంపిక చేసుకోవడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.నేషనల్ స్పైస్ బోర్డు ప్రతినిధి ఉపేందర్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో నాణ్యమైన పసుపునకు ఉన్న అధిక డిమాండ్‌ను వివరించారు. స్పైస్ బోర్డు ద్వారా అందుబాటులో ఉన్న వివిధ రకాల రాయితీలు,ప్రభుత్వ సహాయ సహకారాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉద్యాన శాఖాధికారి మౌనిక మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యాన రంగానికి అందిస్తున్న పథకాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు.కేవలం రసాయన ఎరువులపైనే ఆధారపడకుండా ఆర్గానిక్ (సేంద్రీయ) ఎరువులను వాడాలని, విధిగా పంట మార్పిడి పద్ధతులను పాటించాలని స్పష్టం చేశారు.ఆవైల్ ఫౌండేషన్ సి.ఇ.ఓ రమేష్ మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రామ్ రెడ్డి, ఎఎమ్‌సి చైర్మన్ భీమ్ రెడ్డి, ఏఓ రాజశేఖర్ రెడ్డి, హెచ్ఇఓ దేవన్న, మాక్స్ సొసైటీ చైర్మన్‌తో పాటు స్థానిక పసుపు, ఆయిల్ పామ్ మరియు కూరగాయల సాగుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులు పంటల సాగులో ఎదురవుతున్న పలు సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్లకు నిధులు మంజూరు

### ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**ప్రజాపక్షం/భైంసా :** నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లకు ఐదు కోట్ల 90 లక్షల 18 వేల రూపాయల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. లో వోల్టేజీ సమస్య వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో సమస్యను పరిష్కరించేందుకు ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.తానూరు మండలంలోని భామ్ని గ్రామంలో 33/ 11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి రెండు కోట్ల 87 లక్షల 98 వేలు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. కుబీర్ మండలంలోని వాయి లింగి గ్రామంలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మూడు కోట్ల రెండు లక్షల 20వేల రూపాయలు నిధులు వెచ్చించడం జరిగిందన్నారు.సమస్యను గత నెల11 న సంబంధిత శాఖ మంత్రికి విన్నవించడంతో వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రుల కు కృతజ్ఞతలు చెప్పారు.గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

## పిఇటి వేధిస్తున్నాడని విద్యార్థుల ఆందోళన



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల సంక్షేమ పాఠశాల (ఇంటర్ కళాశాల)లో పిఇటి రాజు వేధింపులు శృతిమించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు.బుధవారం కళాశాల నుండి ఉపాధ్యాయులకు తెలియకుండా బయటకు వచ్చిన విద్యార్థులు పట్టణంలోని ప్రధాన ఎన్టీఆర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు.పిఇటి తమ పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నాడని,చిన్న చిన్న విషయాలకే తీవ్రంగా కొడుతూ శారీరకంగా,మానసికంగా వేధిస్తున్నాడని విద్యార్థులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని, సదరు పిఇటిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ విషయం తెలియగానే ఎస్సై రాహుల్ గైక్వాడ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.అదే సమయంలో కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ హుటాహుటిన అక్కడకు చేరుకుని విద్యార్థులను సముదాయించారు. ఎస్సై, ప్రిన్సిపాల్ హామీతో విద్యార్థులు ఆందోళన విరమించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు పిఇటి వేధింపుల విషయం ఇప్పటివరకు తన దృష్టికి తీసుకురాలేదని, సమస్య ఉంటే యాజమాన్యంతో మాట్లాడాల్సింది కానీ ఇలా రోడ్డుపై బైఠాయించడం బాధ కలిగించిందన్నారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, సదరు పిఇటిని బాధ్యతల నుండి తక్షణమే తొలగించాలని మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయని, విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే




**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్‌పి మాట్లాడుతూ భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు చేపట్టి సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. కుటుంబ వివాదాలకు సంబంధించి షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. భైంసాలోనే కౌన్సిలింగ్ సదుపాయం కల్పించడం పట్ల బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే గత గ్రీవెన్స్ డేల్లో అందిన పెండింగ్ ఫిర్యాదుల పరిష్కార స్థితిని ఎస్‌పి సమీక్షించారు. పెండింగ్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఏజెన్సీ దళితుల భూములకు పహాణీలు ఇవ్వాలి

### ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతి



**ప్రజాపక్షం/ మావల:** ఏజెన్సీ ప్రాంతాల్లో దళితులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పహాణీలు మంజూరు చేసి, భూ హక్కులు కల్పించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా ఎస్‌సి డిపార్ట్‌మెంట్ చైర్మన్ కె. పరమేశ్వర్ ఆధ్వర్యంలో నాయకులు టిపిసిసి ఎస్‌సి డిపార్ట్‌మెంట్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కరీంనగర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లో దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను, పహాణీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కవ్వంపల్లి సత్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ దళితుల భూ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జాడే నాగోరావు, డిసిసి ఉపాధ్యక్షుడు బ్రిజలాల్ కర్మన్కర్, జిల్లా ఎస్‌సి డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షుడు బిరుదుల లాజర్, ఇతడే విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## వాలేగాంలో దొంగల హల్‌చల్

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా మండలం వాలేగాం గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసిన దొంగలు, ఏకంగా ఐదు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.భారీగా బంగారు ఆభరణాలు,వెండి,నగదుతో పాటు ఓ బైక్‌ను కూడా అపహరించినట్లు సమాచారం.చోరీకి సంబంధించిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.సీసీ కెమెరాల ఆధారంగా దొంగలను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు తెలిపారు.

## బాసర పోలీస్ స్టేషన్ తాత్కాలిక భవనం పరిశీలన



**ప్రజాపక్షం/భైంసా :** బాసర మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు మార్గం సుగమం చేసేందుకు బాసర పోలీస్ స్టేషన్‌ను తాత్కాలిక భవనానికి తరలించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను భైంసా ఎఎస్‌పి సాయి కిరణ్ పరిశీలించారు.ఆర్అండ్‌బి అధికారులు, ఎన్‌సిసి ప్రతినిధులు,బాసర ఎస్‌హెచ్‌ఒ ఇన్‌స్పెక్టర్ దీపక్, ఇతర అధికారులతో కలిసి తాత్కాలిక పోలీస్ స్టేషన్ భవనాన్ని సందర్శించిన ఎఎస్‌పి,ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులు, మౌలిక వసతులు సాంకేతిక ఏర్పాట్ల పురోగతిని పరిశీలించారు.తాత్కాలిక పోలీస్ స్టేషన్‌లో విద్యుత్, నీటి సౌకర్యం,భద్రతా ఏర్పాట్లు, సిసిటివి,ఇంటర్నెట్, కమ్యూనికేషన్ వ్యవస్థ, కార్యాలయ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు తదితర అన్ని అంశాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు,బాసర ఎస్‌హెచ్‌ఒ ఇన్‌స్పెక్టర్ దీపక్, ఎన్‌సిసి అధికారులు,పోలీస్ సిబ్బంది ఇతర సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత ఆర్థోపెడిక్ వైద్యశిబిరం




**ప్రజాపక్షం/నిర్మల్ :** దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, మోకాళ్ల సమస్యలు, క్రీడా గాయాలతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిర్మల్ పట్టణంలో ప్రత్యేక ఓపీ కార్యక్రమం ఏర్పాటు కానుంది. సుమారు 20 ఏళ్లకు పైగా ఆర్థోపెడిక్ విభాగంలో విశేష అనుభవం కలిగిన ప్రముఖ సర్జన్ డాక్టర్ జయకృష్ణ రెడ్డి నేడు నిర్మల్ పట్టణంలోని రోగులకు అందుబాటులో ఉంటారని నిర్వాహకులు తెలిపారు.ప్రతి నెల రెండో గురువారం క్రమం తప్పకుండా నిర్వహించే ప్రత్యేక వైద్య సేవలలో భాగంగా ఈ రోజు ఆయన స్థానిక రోగులను ప్రత్యక్షంగా పరీక్షించి తగిన వైద్య సలహాలు,సూచనలు అందించనున్నారు. ఈ ప్రత్యేక వైద్య కార్యక్రమం దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# మాల్స్ వద్ద పార్కింగ్ గందరగోళం

### అధికారుల పర్యవేక్షణ ఏదీ?
### రోడ్డుపైనే వాహనాలు..
### పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు



**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. మాల్స్‌కు వచ్చే వినియోగదారుల వాహనాలను నిలిపేందుకు తగిన సదుపాయం లేకపోవడంతో ప్రధాన రహదారులపైనే వాహనాలను నిలిపే పరిస్థితి నెలకొంటోంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. మాల్స్ నిర్మాణం, ప్రారంభానికి ముందు సంబంధిత విభాగాల అధికారులు పార్కింగ్ సదుపాయాలపై ఏ మేరకు పరిశీలన చేపట్టారన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే సమయంలో ఆమోదించిన ప్రణాళికలో పార్కింగ్ కోసం ఎంత స్థలం కేటాయించారు? ప్రస్తుతం ఆ స్థలం అందుబాటులో ఉందా? కేటాయించిన పార్కింగ్ స్థలాన్ని వాహనదారులు వినియోగిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.ఆమోదిత ప్రణాళికలో పార్కింగ్ ఉన్నప్పటికీ వాహనాలు రోడ్డుపైనే నిలుస్తున్నట్లయితే అందుకు కారణం ఏమిటన్నది కూడా తేలాల్సి ఉంది. పార్కింగ్ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారా? వాహనాల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్ సరిపోవడం లేదా? లేక పార్కింగ్ నిర్వహణలో లోపాలున్నాయా? అనే విషయాలను సంబంధిత అధికారులు పరిశీలించాలి.మరోవైపు మాల్ యాజమాన్యాలు కూడా తమ వినియోగదారుల వాహనాలకు తగిన పార్కింగ్ సదుపాయం కల్పించాల్సిన బాధ్యతను విస్మరించకూడదు. వాణిజ్య కార్యకలాపాల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చే సముదాయాల వద్ద వాహనాల నిలుపుదలకు సరైన ఏర్పాట్లు లేకపోతే ఆ ప్రభావం నేరుగా రహదారులపై పడుతోంది. ఫలితంగా మాల్‌కు వచ్చే వారికి మాత్రమే కాకుండా సాధారణ వాహనదారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఇక రహదారులపై వాహనాల నిలుపుదలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నప్పుడు ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న చర్యలపైనా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో పర్యవేక్షణ ఎంతవరకు జరుగుతోంది? రోడ్డుపై వాహనాల నిలుపుదలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నారా? అవసరమైన చోట నో పార్కింగ్ అమలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి చర్యలు చేపడుతున్నారా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. పార్కింగ్ సమస్యను కేవలం ట్రాఫిక్ పోలీసుల సమస్యగా చూడకుండా మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనుమతుల దశలో పార్కింగ్ అంశాన్ని పరిశీలించడంతో పాటు, నిర్మాణం పూర్తయిన తర్వాత ఆమోదిత ప్రణాళికకు అనుగుణంగా పరిస్థితి ఉందా లేదా అన్నది కూడా తనిఖీ చేయాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా పరిస్థితి ఉన్నట్లు తేలితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.నగరంలో వాణిజ్య సముదాయాలు పెరుగుతున్న కొద్దీ వాహనాల రాకపోకలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే పార్కింగ్ సమస్యపై అధికారులు దృష్టి సారించకపోతే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రధాన రహదారులపై వాహనాలు నిలిచిపోవడం వల్ల పాదచారులు, ద్విచక్రవాహనదారులు, ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అందువల్ల సంబంధిత అధికారులు ఆయా మాల్స్ వద్ద క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి పార్కింగ్ పరిస్థితిని సమీక్షించాలని ప్రజలు కోరుతున్నారు. మంజూరైన అనుమతులు, ఆమోదిత భవన ప్రణాళిక, అందులో చూపిన పార్కింగ్ స్థలం, ప్రస్తుతం ఉన్న వాస్తవ పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.మాల్స్ వద్ద పార్కింగ్ గందరగోళానికి శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రహదారులపై వాహనాల నిలుపుదలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి సమస్య పరిష్కారానికి తీసుకోబోయే చర్యలను వెల్లడించాలని నగరవాసులు కోరుతున్నారు.

## సర్పంచ్ తల్లి మృతికి సంతాపం

**ప్రజాపక్షం / జైనూర్ :** జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ తల్లి మాన్కుబాయి అనారోగ్యంతో మృతి చెందగా, డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క కాశీపటేల్‌గూడలోని వారి నివాసానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాన్కుబాయి మృతికి సంతాపంగా బుధవారం మండల కేంద్రంలో వ్యాపారులు మధ్యాహ్నం 2 గంటల వరకు స్వచ్ఛందంగా మార్కెట్ బంద్ పాటించారు. అంత్యక్రియలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తుది వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ రషీద్, పిఎసిఎస్ చైర్మన్ హన్ను పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## పిసిఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం



**ప్రజాపక్షం / జన్నారం :** మండలంలోని చెరుకుగూడకు చెందిన మంత్రి లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి పూర్ణచందర్ రావు ఫౌండేషన్ బుధవారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ముడుగు ప్రవీణ్, సభ్యులు లక్ష్మణ్ నివాసానికి చేరుకుని ఆ యన భార్య, ఇద్దరు కుమార్తెలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యమని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, బాధవత్ సాయికిరణ్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా అంగన్‌వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ

### కలెక్టర్ భవేశ్ మిశ్రా




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో 89 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు, అర్హతల పరిశీలన, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియలో అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించాలని,ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా అవసరమైన స్థాయిల్లో పత్రాలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించిన సమాచారం, తదుపరి దశల వివరాలను దరఖాస్తుదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. మం డల, గ్రామ స్థాయిల్లో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అర్హత పత్రాల పరిశీలనను పూర్తి చేయాలని తెలిపారు. దరఖాస్తుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, భర్తీ చేయిస్తామని చెప్పే వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని ఆయన సూచించారు. భర్తీ ప్రక్రియకు సంబంధించి అధికారిక సమాచారం మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సిడిపిఒలు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 9న పెన్షనర్స్ గ్రీవెన్స్ డే

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం సమస్యలు, కొత్త కలెక్టరేట్‌లో డిటిఓ కార్యాలయం ఉండడం మూలాన ప్రతి చిన్న విషయానికి సుదూర ప్రయాణం చేయలేని రిటైర్డ్ ఉద్యోగుల కొరకు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కారానికి తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో 9న పెన్షనర్స్ గ్రీవెన్స్ డేను పెన్షనర్స్ భవనం నెహ్రూ యువ కేంద్రం పక్కన సుభాష్‌నగర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హనుమాండ్లు తెలిపారు.
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటి డైరెక్టర్ దశరథ్, డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీస్ నిజామాబాద్, అశోక్, రాష్ట్ర కోశాధికారి కె. రామ్మోహన్

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కారేపల్లి గ్రామ శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు (40 కెఎల్) సమీపంలో బీటీ రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారమందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా 4050 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభించిందన్నారు. మృతుడు కుళ్లిపోయిన స్థితిలో ఉండి నలుపు, తెలుపు డిజైన్ గల షర్ట్, బ్రౌన్ కలర్ 3/4 ప్యాంట్, తెలుపు రంగు బనియన్, ఆకు పచ్చ రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతదేహం పక్కన మూడు బెడ్‌షీట్లు కూడా లభించాయి. మృతదేహం సుమారు 4–5 రోజుల క్రితం మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే భీమ్‌గల్ పిఎస్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

## రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే మార్గాలు

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద ప్రకృతి వ్యవసాయం అమలుపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో మోర్తాడ్ మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం ప్రాముఖ్యత, జీవామృతం, బీజామృతం తయారీ విధానం, మల్చింగ్ పద్ధతులు, మార్గాలు రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే మార్గాలు, నేల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతులను అనుసరించటంతో నేల సారాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని మెరుగుపర్చవచ్చని తెలిపారు. రైతులు ఈ పథకం ద్వారా అందించే శిక్షణలు సాంకేతిక సలహాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, సర్పంచ్ పెగడ విజయ్, శెట్‌పల్లి వ్యవసాయ విస్తీర్ణాధికారి మహేష్, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి శస్త్రచికిత్సలు




**ప్రజాపక్షం / మందమర్రి :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మందిని శస్త్రచికిత్సలకు ఎం పిక చేశారు. ఆదివారం 150 మందికి పరీక్షలు నిర్వహించగా వీ రిని గుర్తించారు. బాధితులను బెల్లంపల్లిలోని పి. సత్యనారాయణ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించి మంగళవారం 17 మందికి విజయవంతంగా ఆపరేషన్లు పూర్తి చేశారు. అనంతరం వారిని స్వగృహాలకు చేర్చారు. మిగిలిన 13 మందికి నాలుగు రోజుల తర్వాత శస్త్రచికిత్సలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సోతుకు సుదర్శన్ రావు, పోలు శ్రీనివాస్, పెండ్యాల గౌతం, ఎండి జాకీర్ పాల్గొన్నారు.

## గిరిజనుడిపై అటవీశాఖ అధికారుల దాడి



**ప్రజాపక్షం / కోటపల్లి :** కోటపల్లి మండలం కొత్తపల్లి రాజారం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పట్టుపురుగుల సాగు చేస్తున్న చింతల లస్మయ్య అనే గిరిజనుడిపై అటవీ శాఖ అధికారులు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన లస్మయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అధికారులు, గిరిజనుల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనతో తీవ్ర ఆగ్రహం చెందిన గ్రామస్తులు అటవీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం చెన్నూరు ఎఫ్‌డిఓ కార్యాలయం ఎదుట బైఠాయించి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు.

## సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ




**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** మండలంలోని చింతకుంట రైతు వేదికలో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కింద రైతులకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్తి ఉత్పాదకత మిషన్ కింద రైతులకు అవసరమైన రసాయనిక ఇన్‌పుట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సహజ వ్యవసాయ విధానాలు, పత్తి సాగులో దిగుబడులు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటిస్తూ నాణ్యమైన పంటలు పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఏఈవో గిరీష్, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/ ముస్తాబాద్:** సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం–2005 ఆవిర్భావ దినోత్సవం, అవగాహన సదస్సు కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ హాజరై సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యత, ప్రజలకు ఉన్న హక్కులు, చట్టాన్ని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ చంటి ముదిరాజు , జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్ , తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సూర స్రవంతి , జాతీయ ఉపాధ్యక్షులు గోపినాథన్ గౌడ్, కట్టేకోలా అన్నవరం, సందీప్ రెడ్డి , జాతీయ సహాయ కార్యదర్శి, రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కిఫాయత్ తదితర జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీని బలోపేతం చేస్తూ నిర్వహిస్తున్న కార్యక్రమాలను నాయకులు అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులను కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు, చైర్మన్ చంటి ముదిరాజు మరియు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ శ్దేశాల భూపాల్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. నూతన సభ్యులకు ఐడీ కార్డులు, మెమొంటోలు అందజేసి, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు మరింత సేవ చేయాలని, ప్రజల్లో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోసుకుల నాంపల్లి, జిల్లా కన్వీనర్ కంటే మల్లయ్య, జిల్లా ఇన్‌చార్జ్ నర్సింగోజు శ్రీధర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్లు కొల్లూరి సంతోష్, శ్రీ బైరి రాజశేఖర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు శ్రీచందన భాస్కర్, గోనెల రాజు, జిల్లా కార్యదర్శులు అనంతుల రాజు, గణేష్ రాజు, గొడిసేలా చంద్రమౌళి,గొల్లపల్లి మహిపాల్, జిల్లా సహాయ కార్యదర్శులు ఉప్పుల మల్లేశం రెడ్డి, బుర్ర సురేష్, పార్వతీ ప్రశాంత్, రాగల్ల రాజమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం ప్రతి పౌరుడి హక్కు అని, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో ఆర్‌టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు తమ హక్కులపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంపొందించడం, ప్రజా సమస్యలకు చట్టబద్ధమైన మార్గంలో పరిష్కారం సాధించేందుకు సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించేలా ప్రజలను చైతన్యపరచడం కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నూతన మండల కమిటీలు ఎన్నిక

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ నూతన మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు గద్దెరాశి బగవంతం మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి పుట్ట రవి మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఎంఆర్‌పిఎస్ పోరాడుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కట్కూరి సురేష్, అధికార ప్రతినిధిగా ఆత్మకూరి దినేష్, ప్రధాన కార్యదర్శిగా మల్లారపు లచ్చయ్య, ఉపాధ్యక్షులుగా గొట్టిముక్కల దేవిద్రాజు, తుడుం చందు మాదిగ, అలాగే ఎంఎస్పీ అధ్యక్షులుగా చింతనపల్లి తిరుపతి, అధికార ప్రతినిధిగా గద్దరాశి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఖానాపూర్ లక్ష్మ ణ్, ఎలగందుల బిక్షపతి, పంగ శిరీష, మునిగే ఎల్లం, అందే సామ్యూల్, సర్పంచ్‌లు జ్యోత్స్న అరుణ్, సాయన్న, స్వరూప నరేష్, కొలపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## షూలు పంపిణీ

**ప్రజాపక్షం/ ముస్తాబాద్:** చీకోడ్ గ్రాములో ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసిన షూలను గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహాయ సహకార ఎల్లప్పుడు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రంజిత్, ఉపాధ్యాయుల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోడె మొక్కు చెల్లించుకున్న బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ బాల మాయాదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతకుముందు భీమేశ్వర వసతి గృహానికి చేరుకున్న ఆమెకు వేములవాడ ఆర్డీవో కుమారి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీకి అర్చకులు, వేద పండితులు స్వస్తి వచనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూ జలు నిర్వహించిన ఆమె, క్షేత్ర సంప్రదాయం ప్రకారం కు టుంబ సమేతంగా కోడె మొక్కు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఏవో జయ కుమారి స్వామి, అమ్మవార్ల శేష వస్త్రాలను, ఏఈవో లక్ష్మణ్ రావు, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వీర ప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్‌పై నిరసన

**ప్రజాపక్షం/ ముస్తాబాద్:** మండల కేంద్రములో బుధవారం రాహుల్ గాంధీ అరెస్టు పై నిరసన కార్యక్రమం నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్నికల సంఘం అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపిస్తూ న్యూఢిల్లీలో నిరసన తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీని,నిన్న రాత్రి అరెస్టు చేయడం అక్రమం అని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్జెల రాజు చె ఆరోపించారు. బుధవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు దుద్దెడ భాను, శ్రీనాథ్, పిఎసిఎస్ చెర్మన్ రాజేందర్‌రెడ్డి, నరేష్, భాను, విజయ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆధార్ నమోదు సద్వినియోగం

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఆధార్ నమోదు సులభతరం చేసేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో రెండు రోజులపాటు ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.అక్టోబర్ 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిబిరం మొదటి రోజు బుధవారం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.చిన్నారుల తల్లిదండ్రులు,సంరక్షకులు శిబిరానికి హాజరై ఆధార్ నమోదు సేవలను వినియోగించుకున్నారు.5 సంవత్సరాల లోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం అక్టోబర్ 8న కూడా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.రామగుండం పరిధిలోని అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు,భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు,విద్యా మరియు ఇతర అవసరాలకు ఆధార్ సంబంధిత సేవలు అందుబాటులో ఉండేలా ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కావున 5 సంవత్సరాల లోపు చిన్నారుల తల్లిదండ్రులు అక్టోబర్ 8న రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్స్ నియామకానికి దరఖాస్తులు

జిల్లా విద్యాశాఖ అధికారి శారద

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లాలోని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో (11) పి.ఎం. శ్రీ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రత్యేకావసరాల పిల్లల విద్యాబోధన కోసం తాత్కాలిక పద్ధతిన (ఐదు నెలల కాలానికి) గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్స్ నియామకానికి అర్హులైన, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలోని పిఎం శ్రీ పాఠశాలల్లో పీఎం శ్రీ రామగుండం, జడ్‌పిహెచ్‌ఎస్ కమాన్పూర్, జడ్‌పిహెచ్‌ఎస్. అప్పన్నపేట్, జడ్‌పిహెచ్‌ఎస్ పోత్కపల్లి, జడ్‌పిహెచ్‌ఎస్ ఏక్లాస్పూర్, టిజిడబ్ల్యుఆర్‌ఇఐఎస్ మేడారం, టిజిడబ్ల్యుఆర్‌ఇఐఎస్ మల్లాపూర్, టిజిఎంఎస్, రామగుండం టి.జి.ఎం.ఎస్. జూలపల్లి, టి.జి.ఎం.ఎస్. మల్యాల్ (శ్రీరాంపూర్), టిజిడబ్ల్యుఆర్‌ఇఐఎస్ మంథనిల్లో ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు 10 లోపు ధృవపత్రాలు, దరఖాస్తులు సమర్పించాలని, ఈ నియామకం ద్వారా ఎంపికైన వారికి నెలకు రూ.16,500 గౌరవ వేతనంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి,అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాల కోసం సంబంధిత విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్‌లను సంప్రదించాలని, జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కళాకారుల డిమాండ్లు నెరవేర్చాలి

మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తెలంగాణ ఉద్యమంలో తమ ఆట, పాటలతో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం రోజున స్థానిక అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారథిలో 1000 ఉద్యోగాలు ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పెట్టిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్ష కు డాక్టర్ దాసరి మమతా రెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిరుద్యోగ కళాకారులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి,ప్రజలను చైతన్యపరిచారు. కళాకారులు న్యాయమైన డిమాండ్ల కోసం నిరాహార దీక్షలు చేయాల్సి రావడం విచారకరమని,ప్రభుత్వం వెంటనే స్పందించి,వారి డిమాండ్లను పరిష్కరించకపోతే బిఆర్ఎస్ పార్టీ తరఫున కళాకారుల పోరాటానికి అన్ని వేళలా అండగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పు రాజ్ కుమార్,కాశీపక వాసు,పల్లె మధు, శ్రీకాంత్,స్వామి వివేక్ పటేల్,ఉద్యమకారులు పాల్గొన్నారు.

## బంతిపూల తోటను సందర్శన

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన పందుల రాజయ్య అనే రైతు సాగు చేస్తున్న బంతి పూల తోటను మండల వ్యవసాయ అధికారి అనూష సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకుని,నీటిని సద్వినియోగం చేసుకుంటూ రకాల పంటలను సాగు చేయాలని సూచించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బి.శశిధర్, రైతులు బగ్గని రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

బిఎస్‌పి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏట సంపత్



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి అంగన్‌వాడీ సెంటర్4లో విద్యార్థులకు బహుజన్ సమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఏట సంపత్ ఆధ్వర్యంలో పలుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన స్వహస్తాలతో పలుకలను అందజేశారు.అనంతరం ఏట సంపత్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని,విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.సమాజంలో ఒక సాధారణ వ్యక్తిగా కాకుండా,ఒక గొప్ప వ్యవస్థగా మారి తల్లిదండ్రులకు, సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా ఉంటూ,దేశ ప్రగతికి తోడ్పడాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు.ఈ సేవా కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తిరుమల,సహాయకురాలు కొండమ్మ,విద్యార్థుల తల్లిదండ్రులు,స్థానికులు,తదితరులు పాల్గొన్నారు.